సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 20 । జూన్ । 2025



సమయపాలన పాటించేలా..

అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించేలా పంచాయతీరాజ్ శాఖ బయోమెట్రిక్ హాజరు కోసం యాప్ అమలు చేస్తోంది. 10లో



యుద్ధోన్మాదాన్ని నిరసిస్తూ..

ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య యుద్ధోన్మాదాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహించారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 25°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగానే నమోదవుతాయి. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

సుమనోహరం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన, హారతి సమర్పించాక మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

22 మంది మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 22 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తున్నట్లు ఈఈ సెల్ హెచ్ఓడీ మురళీధర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. బదిలీ అయిన వారిలో తొమ్మిది మంది డీజీఎంలు, ఒక ఎస్ఓఎం, ఆరుగురు అడిషనల్ మేనేజర్లు, ఒక డిప్యూటీ మేనేజర్, ఇద్దరు ఎస్ఈలు, ఇద్దరు డీవైఎస్ఈలు, ఒక సీనియర్ అండర్ మేనేజర్ ఉన్నారని వివరించారు. వీరంతా ఈనెల 28వ తేదీలోగా కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని సూచించారు.

27 వరకు దరఖాస్తుల స్వీకరణ

కొత్తగూడెంఅర్బన్: సహాయ ఉపకరణాల కోసం జిల్లాలోని అర్హులైన దివ్యాంగుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఇందుకు ఈనెల 27 వరకు గడువు ఉందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లు, మొబైల్ బిజినెస్ బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో హైబ్రిడ్ వీల్ చైర్, ల్యాప్‌టాప్‌లు, 5జీ స్మార్ట్ ఫోన్, ట్రై సైకిల్, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. దరఖాస్తు కాపీలను తమ కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు 63019 81960, 83310 06010 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రెండో రోజు టీజీ టెట్ ప్రశాంతం

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో రెండో రోజు గురువారం నిర్వహించిన టీజీ టెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 120 మందికిగాను మొదటి షిఫ్ట్‌లో 93 మంది, రెండో షిఫ్ట్‌లోనూ 93 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు, రేపు జాతీయ సదస్సు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ జూనియర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన శుక్ర, శనివారాల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ జకీరుల్లా తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలంగాణ సాహిత్య అకాడమీ తదితర విభాగాల ఆధ్వర్యాన శతజయంతి సాహితీమూర్తులు దాశరథి, ఆరుద్ర జీవితం, సాహిత్యంపై ఈ సదస్సు జరుగుతుందని వెల్లడించారు. కళాశాల విద్యా కమిషనర్ ఎ.శ్రీదేవసేనతో పాటు పలువురు కవులు, కళాకారులు హాజరవుతారని తెలిపారు.

ఇల్లెందుకు దేవాదుల!



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాకాల జలాశయం వరకు వస్తున్న గోదావరి జలాలు

- అక్కడి నుంచి బయ్యారం పెద్ద చెరువుకు తరలింపు
- ముందుగా గార్ల, బయ్యారం మండలాలకు నీరు..
- ఆపై బయ్యారం నుంచి రోళ్లపాడుకు వస్తే ఉమ్మడి జిల్లాకు లబ్ధి
- సీఎం రేవంత్ చెంతకు ప్రతిపాదన



పాకాల చెరువు దగ్గర మంత్రి సీతక్క, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సీతారామ ద్వారా గోదావరి జలాలు అందించేందుకు చేస్తున్న భగీరథ ప్రయత్నం కొనసాగుతూనే ఉంది. అయితే సీతారామ కంటే వేగంగా, తక్కువ ఖర్చుతో దేవాదుల ద్వారా గోదావరి జలాలను ఉమ్మడి జిల్లాకు తెచ్చే ప్రణాళికపై చర్చలు జరుగుతున్నాయి.

ప్లాన్ మారింది.. నీళ్లు రాలేదు

సీతారామ ప్రాజెక్టు పనులు 2016లో ప్రారంభించినప్పుడు దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి లిఫ్ట్ చేసిన గోదావరి నీటిని జిల్లాలో ఎత్తయిన ప్రాంతమైన ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడుకు తరలించాలని నిర్ణయించారు. పది టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించి, ఇక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని ఉమ్మడి జిల్లాలోని పంటపొలాలకు తరలించాలని భావించారు. అయితే దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి రోళ్లపాడు వరకు నీటిని తెచ్చే క్రమంలో కిన్నెరసాని అభయారణ్యం అడ్డుగా ఉందంటూ ఈ ప్లాన్‌ను మార్చారు. దీంతో గోదావరి నీటిని ములకలపల్లి మండలం వరకు తరలించి, అక్కడి నుంచి రెండు వేర్వేరు లిఫ్టుల ద్వారా సత్తుపల్లి ట్రంక్ కెనాల్, పాలేరు కెనాల్‌గా రీ డిజైన్ చేశారు. ప్రస్తుతం సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులు జరుగుతుండగా పాలేరు పనులు మధ్యలో నిలిచిపోయాయి. జూలూరుపాడు వద్ద 10 కి.మీ. టన్నెల్ పూర్తయితేనే పాలేరుకు నీరు.. లేదంటే రాజీవ్ కెనాల్ ద్వారా ఎన్నెస్పీ ఆయకట్టు స్థిరీకరణతో సరిపెట్టుకోవాల్సిందే.

అనేక అడ్డంకులు..

సీతారామ ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో 6.50 లక్షల ఎకరాలకు నీరందించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు సుమారు రూ.20,000 కోట్లు ఖర్చు పెట్టినా ఆశించిన ఫలితం దక్కలేదు. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు, నిధుల కేటాయింపు చూస్తుంటే అశ్వారావుపేట, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రెండు లక్షల ఎకరాలతో పాటు రాజీవ్ కెనాల్ ద్వారా వైరా దిగువన ఉన్న నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరందే పరిస్థితి మాత్రమే ఉంది. అటవీశాఖ అనుమతులు సాధించి, భారీగా నిధులు కేటాయిస్తేనే జూలూరుపాడు దగ్గర పది కిలోమీటర్ల పొడవైన టన్నెల్ నిర్మాణం పూర్తవుతుంది. ఆ తర్వాతే పాలేరు, ఖమ్మం నియోజకర్గాలకు నీరు అందనుంది. ఇక ఇల్లెందు నియోజకవర్గం, మహబూబాబాద్ జిల్లా ప్యాకేజీ కోసం అదనంగా రూ.3,200 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

పాకాల నుంచి బయ్యారం వరకు..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు గోదావరి జలాలు అందించేందుకు 25 ఏళ్ల క్రితం దేవాదుల ప్రాజెక్టును చేపట్టారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోసిన నీరు రామప్ప జలాశయం ద్వారా పాకాల వరకు వస్తోంది. అక్కడికి చేరుకున్న గోదావరి నీటిని బయ్యారం చెరువుకు తరలించే ప్రత్యామ్నాయ ప్లాన్‌ను ప్రభుత్వం ఆలోచిస్తోంది. పాకాల చెరువు సముద్ర మట్టం నుంచి 250 అడుగుల ఎత్తులో ఉండగా బయ్యారం చెరువు 198 అడుగుల ఎత్తులో ఉంది. అయితే మధ్యలో కొన్ని గుట్టలు అడ్డుగా ఉన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.1000 కోట్లు ఖర్చు చేసి కొన్ని ఎత్తిపోతలు, కొత్త కాల్వల నిర్మాణం ద్వారా పాకాల నుంచి బయ్యారం వరకు గోదావరి జలాలు తేవచ్చనే నిర్ణయానికి వచ్చారు.

సీఎం రేవంత్ దృష్టికి

పాకాల – బయ్యారం పెద్ద చెరువుకు ప్రణాళిక అమల్లోకి వస్తే మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో కొత్తగూడ, గంగారం మండలాలకు లబ్ధి చేకూరుతుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, సీఎంకు సన్నిహితుడిగా పేరున్న వేం నరేందర్‌రెడ్డి మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు. దీంతో ఈ ప్లాన్‌ను పట్టాలెక్కించే విషయంలో వారిద్దరూ సుముఖంగా ఉన్నారు. ఇప్పటికే మంత్రి సీతక్క, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గత మార్చిలో దేవాదుల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఇటీవల సీఎం రేవంత్ దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ ప్లాన్‌కు ఆమోదం లభిస్తే బయ్యారం వరకు వచ్చిన నీటిని రోళ్లపాడు మీదుగా పాలేరుకు తరలించే అంశంపై ఉమ్మడి జిల్లా మంత్రులు దృష్టి సారించాల్సి ఉంటుంది.

మెరుగైన చికిత్స అందించాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్
- పాల్వంచ సీహెచ్‌సీలో తనిఖీలు



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

పాల్వంచ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సతీమణి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయిన నేపథ్యంలో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించేందుకు గురువారం ఆయన సీహెచ్‌సీకి వచ్చారు. అన్ని వార్డుల్లో తిరుగుతూ ఎలా చికిత్స అందుతోందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ రకాల జబ్బులతో ఆస్పత్రికి వచ్చే బాధితులతో మమేకమై చికిత్స అందించాలని, విధుల్లో లోటుపాట్లు ఉండొద్దని, సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో అజయ్‌కుమార్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. అంకిత భావంతో పనిచేస్తే ఉద్యోగులకు మంచి పేరు వస్తుందని అన్నారు. అనంతరం జిల్లాలోని ఏడు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందిస్తున్న 80 మంది సిబ్బందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజు దొర, డాక్టర్ ముక్కంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘చేయూత’కు ఆకర్షితులవుతున్నారు..



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, పక్కన పోలీస్ అధికారులు

- ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడి
- 12 మంది మావోయిస్టుల లొంగుబాటు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆపరేషన్ చేయూతకు ఆకర్షితులై మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేందుకు మొగ్గు చూపుతున్నారని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం 12 మంది మావోయిస్టులు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకు 294 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. వీరిలో ముగ్గురు డీవీసీఎంలు, 17 మంది ఏసీఎంలు, 34 మంది పీఎంలు, 107 మంది మిలీషియా సభ్యులు, 35 మంది ఆర్పీసీలతో పాటు మరో 98 మంది వివిధ స్థాయిల్లో పనిచేసిన వారు ఉన్నారని వివరించారు. ప్రస్తుతం తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో మావోయిస్టులు సంచరిస్తున్నారని, సరిహద్దు గ్రామాల ప్రజలు వారికి సహకరించొద్దని కోరారు. లొంగిపోవాలనుకున్న మావోలు స్థానిక పోలీస్‌స్టేషన్లలో బంధువుల ద్వారా సంప్రదించాలని సూచించారు. గురువారం లొంగిపోయిన 12 మంది మావోయిస్టులకు మొదట రూ.25 వేల చొప్పున నగదు అందజేశారు. వారి హోదాను బట్టి అందించే మిగతా సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ ముఖేష్‌కుమార్ సింగ్, 141 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ ప్రతాప్ పుర్తి, చర్ల సీఐ రాజువర్మ, ఆర్ఐ రవి పాల్గొన్నారు.

రక్షణ చర్యలు పటిష్టపర్చాలి



మాట్లాడుతున్న కన్నన్, హాజరైన అధికారులు

- గనుల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలి
- మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కన్నన్

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట రక్షణ చర్యలు అమలు చేయాలని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీడీజీఎంఎస్) టి.ఆర్.కన్నన్ అధికారులకు సూచించారు. స్థానిక ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో గురువారం కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లోని గనుల్లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కన్నన్ మాట్లాడుతూ.. ఉపరితల గనుల్లో వాహనాలు నడిపేటప్పుడు స్పీడ్ లిమిట్ ఉండాలని, బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్లు, లారీలు కూడా వేగ నియంత్రణ పాటించాలని ఆదేశించారు. మెకానిక్‌లు వినియోగించే పరికరాలు ఎంతమేరకు సామర్థ్యం కలిగి ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. కాలపరిమితి ముగిసిన పరికరాలను తిరిగి పంపించి కొత్తవి సమకూర్చుకోవాలని చెప్పారు. ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మైన్స్, ఉపరితల గనుల ఆవరణల్లో తిరిగే వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ అశోక్‌కుమార్, డీజీఎంఎస్‌లు సనత్‌కుమార్, దిలీప్, కమలేష్‌కుమార్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియా జీఎంలు ఎం.శాలేం రాజు, దుర్గం రాంచందర్, కృష్ణయ్య, సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, రీజియన్ సేఫ్టీ జీఎం కె.జి.తివారి, ఇతర విభాగాల జీఎంలు సూర్యనారాయణ, రఘురామ్, ఫ్రెజీరాల్డ్, తిరుమలరావు, ఎస్.దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యమే కాపాడుతోందా?

- డీసీసీబీలో రూ.కోట్ల అక్రమాలపై విచారణకే పరిమితం
- నేడు మహాజన సభలో చర్చకు పట్టుబట్టే అవకాశం



ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) 127వ మహాజన సభ శుక్రవారం జరగనుండగా, బ్యాంకులో ఏళ్ల క్రితం అక్రమాలపై పలువురు చర్చకు పట్టుబట్టే అవకాశముందని తెలుస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం ఖమ్మంలోని పలు బ్రాంచ్‌ల ద్వారా 21మంది ఇళ్ల నకిలీ ధ్రువపత్రాలతో రూ.6 కోట్ల రుణాలు తీసుకున్నారు. ఇవేకాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బ్రాంచ్‌ల ద్వారా రుణాల మంజూరీలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. వీటిపై నాలుగేళ్లుగా వివిధ స్థాయిల్లో విచారణ జరుగుతుండగా, కేవలం ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మిగతా బ్రాంచ్‌ల అధికారులు అక్రమాలకు కారణమని తెలిసినా ప్రధాన కార్యాలయంలో ఒక ఉద్యోగిని సస్పెండ్ చేయడంతోనే సరిపెట్టడం గమనార్హం. మిగతా వారికి రాజకీయ నాయకుల అండ ఉండడంతో విచారణల పేరిట కాలం వెళ్లదీస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కాగా, రూ.6కోట్ల రుణం తీసుకుని చెల్లించని వ్యవహారంపై గత పాలకవర్గం రాష్ట్ర సహకార బ్యాంకు(టస్కాబ్) దృష్టికి తీసుకెళ్లగా సహకార శాఖ రిజిస్ట్రార్ విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ విచారణ తర్వాత నివేదిక సమర్పించినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. ఈ వ్యవహారంపై కొద్దినెలల క్రితం జరిగిన సమావేశంలో డైరెక్టర్లు ప్రశ్నించారు. దీంతో శుక్రవారం జరిగే సమావేశంలో గట్టిగా నిలదీయాలని డైరెక్టర్లు భావిస్తుండడంతో, మహాజన సభలో చర్చించేలా అజెండాగా చేర్చారు. అంతేకాక స్థానిక అధికారులతో విచారణ చేయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై బ్యాంకు సీఈఓ వెంకటఆదిత్యను సంప్రదించగా రుణ అక్రమాలపై మహాజన సభలో నిర్ణయం తీసుకునే అవకాశముందని, సభ్యులు చర్చిస్తే విచారణకు తీర్మానిస్తామని తెలిపారు. అలాగే, ఏడాది క్రితం బ్యాంకులో జరిగిన పలు అక్రమాలపైనా సభ్యులు నిలదీయనున్నట్లు సమాచారం. కాగా, వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పంట రుణాలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎరువుల పంపిణీపై చర్చించేలా అజెండాలో చేర్చారు.

రూ.7,700.87కోట్లతో రుణ ప్రణాళిక

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి



భద్రాచలం : మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే వెంకట్రావు, పీఓ రాహుల్, డీఎంహెచ్ఓ భాస్కర్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.7700.87 కోట్ల రుణ ప్రణాళిక లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వార్షిక రుణ ప్రణాళిక ఖరారు చేశారు. గతేడాదికి సంబంధించి రైతులు, స్వయం సహాయక సంఘాలతో పాటు వివిధ సంక్షేమ శాఖల రుణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ పథకాల లక్ష్య సాధనకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,242.49 కోట్లకు గాను రూ. 3,960.63 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. రుణాల మంజూరుతో పాటు రికవరీపై శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఇందులో వ్యవసాయ అవసరాలకు రూ. 3,838 కోట్లు, ఎంఎస్ఎంఈ కింద రూ. 847.80 కోట్లు, ఇతర రంగాలకు రూ. 4,883.99 కోట్లు అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ తిరుపతయ్య, పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్వర్లు, అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

29, 30వ తేదీల్లో కేన్సర్ చికిత్స శిబిరాలు..

ఈనెల 29న భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాల, 30న దుమ్ముగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో కేన్సర్ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కరపత్రాలు, బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.ఎల్. కాంతారావు, ఆయా సంఘాల బాధ్యులు సూర్యనారాయణ, జగదీష్, బి.రాజారెడ్డి, బి. సుబ్బరాజు, ఎం. మోహన్‌రావు, సుదర్శనరావు, పి.రాజశేఖర్, భానుప్రసాద్, వి.కామేశ్వరరావు, గట్టు వెంకటాచార్య, కమలా రాజశేఖర్, పాకాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌పై అప్రమత్తత అవసరం

భద్రాచలం: ఏజెన్సీ ప్రాంత గిరిజనులు సికిల్‌సెల్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా డే సందర్భంగా ఐటీడీఏలో గురువారం రక్త పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సికిల్‌సెల్ అనీమియా ప్రాణాంతక వ్యాధి కాదని, జన్యుపరంగా వస్తుందని తెలిపారు. ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స పొందాలని సూచించారు. గిరిజనులు మూఢనమ్మకాల వైపు వెళ్లకుండా అవగాహన జాతాలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. 2047 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించేలా చూడాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని 130 గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, ఏడీఎంహెచ్ఓ చైతన్య, సికిల్‌సెల్ ప్రోగ్రాం అధికారి మధుకర్, ఆర్ఎంఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అవగాహన అవసరం

చుంచుపల్లి: పంచాయతీల అభివృద్ధికి అవగాహన అవసరమని కలెక్టర్ అన్నారు. గురువారం ఐడీఓసీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణం, డిజిటల్ లావాదేవీలు, మహిళా భాగస్వామ్యం వంటి విభిన్న అంశాల్లో పంచాయతీల స్థితిగతులు అర్థమవుతాయని అన్నారు. వీటి పురోగతిపై అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ చంద్రమౌళి, డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు బంగారు హారం

రూ.5 లక్షల విలువైన ఆభరణం అందజేత



ఆలయ ఈఓకు హారం అందిస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన ఎం.కృష్ణచైతన్య – రాజ్యలక్ష్మి దంపతులు గురువారం బంగారుహారం అందజేశారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో తయారు చేయించిన 52.25 గ్రాముల హారాన్ని మొదట స్వామివారి మూలమూర్తుల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు.

మట్టితో మాట్లాడుదాం..!

- కొత్తగూడెంలో సండే బ్రిక్స్ ఓపెన్ చాలెంజ్
- యువత, వాకర్లు, పౌరులు అందరికీ అవకాశం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మట్టితో మాట్లాడితే.. మట్టిలో కలిసి పని చేస్తే కొత్త ఉత్సాహం, మార్పు వస్తుందనే ఉద్దేశంతో సండే బ్రిక్స్ ఓపెన్ చాలెంజ్ కార్యక్రమాన్ని వినూత్నంగా చేపడుతున్నారు కలెక్టర్ జితేశ్ వి పాటిల్. ‘పర్యావరణ హితంగా మట్టి ఇటుకలు తయారు చేయండి – ఆరోగ్యాన్ని పొందండి – బహుమతులు గెలుచుకోండి’ అనే నినాదంతో వచ్చే ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రగతి మైదాన్‌లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు మట్టి ఇటులక తయారీ పోటీని నిర్వహిస్తున్నారు. అత్యధిక ఇటుకలు తయారు చేసిన వారిని ‘బ్రిక్స్ చాంపియన్’ గా గుర్తించి టీ షర్ట్ బహుమతి అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ పోటీకి యువత, వాకర్లు, పౌరులు, విద్యార్థులు, మహిళలు అందరూ అర్హులేనని వివరించారు.

శ్రమకు గౌరవం.. కొత్త మార్పు..

బ్రిక్ చాలెంజ్ అనేది కేవలం పోటీ మాత్రమే కాదని, కొద్దిసేపు మట్టితో పనిచేసిన అనుభవం ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని, యాంత్రిక జీవితంలో కొత్త మార్పుకు నాంది పలుకుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. అంతేకాదు.. స్థానిక వనరుల వినియోగం, శ్రమకు గౌరవం, ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక ఐక్యత, వ్యక్తిగత చొరవ వంటి విలువలను నేటి తరంలో పెంపొందించేందుకే ఈ వినూత్న పోటీ పెడుతున్నట్టు తెలిపారు. పోటీ తర్వాత ఇటుకల తయారీపై వర్క్‌షాప్ ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

భద్రాచలంటౌన్: బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ ఆదేశించారు. భద్రాచలం పట్టణంలోని డీ అడిక్షన్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. రోగులతో మాట్లాడి చికిత్స అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వ్యసనాలకు బానిసలైన వ్యక్తులు వాటి నుంచి బయటపడేందుకు మానసిక నిపుణులతో కలిసి కౌన్సెలింగ్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎస్.జయలక్ష్మి, ఉదయ్, చైతన్య, ఫైజ్‌మోహినుద్దీన్, బి.సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

26న నిరుపయోగ వస్తువుల వేలం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఈ నెల 26న ఉదయం 10 గంటలకు హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించనున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ మానిటర్లు, సీపీయూలు, కీ బోర్డులు, మౌస్‌లు, యూపీఎస్‌లు, ట్యాబ్‌లు, యాపిల్ ఐప్యాడ్‌లు, ఇన్వర్టర్, ఇన్వర్టర్ బ్యాటరీలు, డ్రాగన్ లైట్లు, టార్చ్‌లైట్లు, క్లాత్ టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలు, ఫర్నిచర్ సామగ్రి, ఇతర వస్తువులను వేలం వేస్తామని వివరించారు. ఆసక్తి కలిగినవారు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో పాటు ఒక జిరాక్స్ కాపీ తీసుకుని ఆర్ఐ అడ్మిన్ షేక్ లాల్‌బాబును 87126 82143 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రెండు బైక్‌లు ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. సుభాష్‌నగర్‌కు చెందిన చీకటి రాకేష్ బైక్‌పై జగదాంబగుంపునకు బయలుదేరాడు. అదే సమయంలో రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ మొట్లగూడెం గ్రామానికి చెందిన కల్తి ప్రవీణ్, సూర్నపాక శ్రీను, సూర్నపాక ఆదిలక్ష్మి మరో బైక్‌పై కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న చీకటి రాకేష్, కల్తి ప్రవీణ్‌లను ఖమ్మం సిఫారసు చేశారు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇల్లెందురూరల్: పోచారంతండా, కొమరారం గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పోచారంతండా గ్రామపంచాయతీ అమర్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన గుగులోత్ బాలునాయక్ (45) బైక్‌పై కొమరారం వస్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్రంగా గాయమైంది. అదే మార్గంలో వెళుతున్న వ్యక్తులు ప్రమాదాన్ని గుర్తించి బాలునాయక్‌ను కొమరారం పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కొమరారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గ్రానైట్ వ్యాపారి అరెస్ట్

ఖమ్మంక్రైం: మహిళపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఓ గ్రానైట్ వ్యాపారిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో నివసించే ఓ కుటుంబంతో కలిసి అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు గ్రానైట్ వ్యాపారం చేస్తున్నాడు. తరచుగా వారి ఇంటికి వెళ్లే వెంకటేశ్వర్లు ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు.

సమయపాలన పాటించేలా..

- పంచాయతీరాజ్‌లో ముఖ గుర్తింపు హాజరు పద్ధతికి కసరత్తు
- ఇప్పటికే గ్రామపంచాయతీ కార్యదర్శులకు వర్తింపు
- త్వరలో మండల పరిషత్‌ల్లో అమలుకు చర్యలు



ఇల్లెందు మండల పరిషత్ కార్యాలయం

ఇల్లెందురూరల్: అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించేలా పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే విద్య, వైద్య విభాగాల్లో ప్రయోగాత్మకంగా పలు జిల్లాల్లో అమలు చేస్తున్న ముఖగుర్తింపు హాజరు విధానాన్ని ప్రస్తుతం పంచాయతీల్లో ప్రత్యేక యాప్ ద్వారా కార్యదర్శులకు అమలు చేస్తోంది. ఇదే విధానాన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో కూడా అమలు చేయనుంది.

సామగ్రి చేరక జాప్యం..

ఈ నెల 16వ తేదీ నుంచి అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నా ముఖ గుర్తింపు హాజరుకు సంబంధించిన సామగ్రి కార్యాలయాలకు చేరకపోవడంతో జాప్యం జరుగుతోంది. కాగా నూతన హాజరు విధానం కోసం ఎంపీడీఓ, ఎంపీఓ, పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, పీఆర్ ఏఈలు, గృహనిర్మాణ శాఖ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏపీవోలు, టీఏలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఉద్యోగులు, సిబ్బంది వివరాలు, ఆధార్‌కార్డుల వివరాల సేకరణ మొదలుపెట్టారు. సంబంధిత సామగ్రి రాగానే నూతన విధానాన్ని అమలు చేయనున్నారు. ఉదయం విధులకు రాగానే, సాయంత్రం విధులు పూర్తయ్యాక రెండుసార్లు ముఖ గుర్తింపుతో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. దీనికి జీపీఎస్‌ను అనుసంధానం చేస్తారు. ఇలా నమోదైన రోజు వారీ హాజరు నివేదికను రాష్ట్ర కార్యాలయాలకు పంపుతారు.

ఇతర విభాగాల్లోనూ కసరత్తు

2019లో మహబూబాబాద్ జిల్లాలోని మండల స్థాయి కార్యాలయాల్లో అప్పటి కలెక్టర్ శివలింగయ్య బయోమెట్రిక్ విధానంలో ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని ప్రారంభించారు. ఏడాదిన్నర పాటు సాఫీగా సాగినా కరోనా సమయంలో రద్దయింది. వైద్యశాఖలోనూ ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ఖమ్మం జిల్లాలో అమలు చేశారు. ఇక్కడ విజయవంతం కావడంతో అన్ని జిల్లాల్లో ప్రారంభించేందుకు వైద్యశాఖ కసరత్తు చేస్తోంది. విద్యాశాఖలో విద్యార్థుల హాజరును ముఖగుర్తింపు పద్ధతిలో అమలు చేస్తుండగా, ఈ విధానాన్ని ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేసేందుకు విద్యాశాఖ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

గతంలో వేలిముద్ర ప్రయోగం

ఉద్యోగులు సమయ పాలన పాటించేలా గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేలిముద్ర హాజరు విధానం ఉండేది. సంబంధిత యంత్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో అనతికాలంలోనే హాజరు పట్టికలో సంతకం విధానం కొనసాగుతోంది. దీంతో ఎప్పటిలాగే ఉద్యోగులు ఆలస్యంగా రావడం, తొందరగా వెళ్లడం, విధులకు రాకపోయినా మరుసటి రోజు వచ్చి సంతకాలు చేయడం వంటివి జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యానికి చెక్ పెట్టేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మండల పరిషత్ కార్యాలయాల్లో ముఖ గుర్తింపు హాజరు విధానం అమలుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారు.



ఉత్తర్వులు అందాయి..



మండల పరిషత్ కార్యాలయాల్లో ముఖగుర్తింపు హాజరు విధానం అమలు చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. దీనికి సంబంధించి బయోమెట్రిక్, ఇతర యంత్ర సామగ్రి అందుబాటులోకి రాగానే నూతన విధానం ప్రకారం హాజరు నమోదు ప్రారంభిస్తాం.

– ధన్‌సింగ్, ఎంపీడీఓ, ఇల్లెందు

యుద్ధోన్మాదాన్ని నిరసిస్తూ..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పక్కన సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

సూపర్‌బజార్(కొత్తగూడెం): యుద్ధోన్మాదాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. వామపక్ష పార్టీ జాతీయ కమిటీల పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ కార్యాలయాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అమెరికా తన ఆయుధ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు వివిధ దేశాల మధ్య చిచ్చుపెడుతూ యుద్ధాలకు ప్రేరేపిస్తోందని, ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం ట్రంప్ సామ్రాజ్యవాద కాంక్షకు పరాకాష్ట అని విమర్శించారు. ప్రపంచ దేశాలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని అమెరికా కర్రపెత్తనం చేస్తోందని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ నిరంతర బాంబు, వైమానిక దాడులకు పాల్పడుతూ లక్షలాది మందిని పొట్టన పెట్టుకుంటూ మారణ హోమాన్ని సృష్టిస్తోందని అన్నారు. అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులు హరించుకుపోతున్న పరిస్థితిలో పాలస్తీనా ప్రజలకు ప్రపంచమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. అమెరికా ముందు మోకరిల్లే విధానాలకు స్వస్తి చెప్పి ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధంపై ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వ్యతిరేకంగా నోరు విప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, న్యూడెమోక్రసీ నాయకుడు కందగట్ల సురేందర్ కూడా మాట్లాడారు.

64 మంది విద్యార్థులు.. ఇద్దరు టీచర్లు

టేకులపల్లి: మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామం బర్లగూడెం (గొల్లగూడెం) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 64 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు మాత్రం ఇద్దరే ఉన్నారు. గురువారం కేవలం హెచ్‌ఎం మాత్రమే హాజరయ్యారు. మరో టీచర్ రాలేదు. రోజూ ఇద్దరు హాజరైతేనే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఏ రోజైనా ఒక టీచర్ సెలవు పెడితే 64 మంది విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు ఒక్కరూ మాత్రమే బోధించాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి బర్లగూడెం పాఠశాలకు మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠం చెబుతున్న హెచ్‌ఎం

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం కిరణ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 21న సింగరేణివ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సీఎస్సార్) జీవీ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో అన్ని ఏరియాల పర్సనల్ విభాగం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, గనులు , డిపార్ట్‌మెంట్లలోని ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కారుణ్య నియామకాల పక్రియ వేగవంతం చేయాలని, చిన్న, చిన్న తప్పిదాలను ఏరియా స్థాయిలోనే సరిచేసి, డిపెండెంట్లకు త్వరితగతిన ఉద్యోగాలు వచ్చేలా చూడాలన్నారు. టర్మినెల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మురళీధర్ రావు, కేశ నారాయణ రావు, బి.శివకేశవ రావు, ముకుంద సత్యనారాయణ, టి. శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలి

సీడబ్ల్యూసీఈ అధికారి పృథ్వీరాజ్



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు

కరకగూడెం: నీటి సంరక్షణ పద్ధతులపై గ్రామీణ ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సెంట్రల్ వాటర్ కమిషన్ ఇంజనీరింగ్ (సీడబ్ల్యూసీఈ) పృథ్వీరాజ్ సూచించారు. గురువారం జలశక్తి అభియాన్ కార్యక్రమ పర్యవేక్షణలో భాగంగా మండలంలోని అనంతారం, సమత్ మోతె, వట్టంవారి గుంపు, తాటిగూడెం, కరకగూడెం, సమత్ భట్టుపల్లి, కన్నాయిగూడెం గ్రామాలను సందర్శించారు. ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, నీటి నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం కోసం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజు, భాస్కర్, కృష్ణయ్య, పాపయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి పదవులు ఇవ్వకుంటే గుణపాఠం చెబుతాం



సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: యాదవులు, మున్నూరు కాపులతో పాటు ఎంబీసీలకు మంత్రి పదవులు ఇవ్వకుంటే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ రాష్ట్ర బీసీ జనసభ అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ హెచ్చరించారు. ఖమ్మంలో గురువారం 'బీసీల రిజర్వేషన్లు, మంత్రి పదవుల కేటాయింపు'అంశంపై తెలంగాణ యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి గుమ్మా రోశయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యాదవులు, మున్నూరుకాపులు, ఎంబీసీలు సహకరించగా, యూపీఏ-1, 2 ప్రభుత్వం మనుగడలోనూ ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్ కృషి ఉందని తెలిపారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి యాదవజాతిని నిర్లక్ష్యంగా చూడడం సరికాదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచనల మేరకు ఇకనైనా మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై 30వ తేదీన యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యాన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రాజారాం కోరారు. సదస్సులో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మున్నూరు కాపు సంఘం నాయకుడు గుండాల కృష్ణ, గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి అమరగాని వెంకన్నగౌడ్, తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి లింగయ్య యాదవ్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు ఎర్రబోయిన గోవిందరావు, గోవర్ధన్, మేకల కృష్ణ, మధు, బారీ మల్సూర్, చిత్తారు ఇందుమతి, జడ మల్లేష్, జంగా సత్యనారాయణ, మీగడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డ ఘటన మండల పరిధిలోని మాధారం అటవీ ప్రాంతంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మాధారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై పాల్వంచకు వెళుతున్నాడు. అదే సమయంలో ఇల్లెందు మండలానికి చెందిన దంపతులు మరో బైక్‌పై దమ్మపేట వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మాధారం అటవీ ప్రాంతంలో శ్రీకాంత్ ద్విచక్ర వాహనం అదుపుతప్పి దంపతుల బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం పాల్వంచ నుంచి ములకలపల్లి వస్తున్న డీసీసీ బ్యాంక్ ఉద్యోగి ప్రేమ్ సాగర్ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్, ప్రేమ్‌సాగర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. అదేసమయంలో అటుగా వస్తున్న ములపలపల్లి తహసీల్దార్ భూక్యా గన్యా కారులో క్షతగాత్రులను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాలుడి గొంతులో ప్లాస్టిక్ గన్ బుల్లెట్

- ఏడాదిగా నొప్పి, మింగలేక ఇబ్బందులు
- శస్త్రచికిత్స ద్వారా బయటకు తీసిన వైద్యుడు





బాలుడు, ఆయన తల్లిదండ్రులతో డాక్టర్ ప్రవీణ్ (ఇన్‌సెట్) బయటకు తీసిన ప్లాస్టిక్ బుల్లెట్

ఖమ్మంవైద్యవిభాగం: ఆడుకునే క్రమాన ప్లాస్టిక్ గన్ బుల్లెట్‌ను నోట్లో పెట్టుకోగా అది బాలుడి గొంతులో ఇరుక్కుపోయింది. దీంతో ఏడాది కాలంగా నొప్పి, ఏదీ సరిగా తినలేక ఇబ్బంది పడుతుండగా శస్త్రచికిత్స ద్వారా బయటకు తీసిన వైనమిది. మహబూబాబాద్ జిల్లా పాతపోచారం గ్రామానికి చెందిన పి.శ్రవణ్‌కుమార్ – సౌజన్య దంపతుల మూడేళ్ల కుమారుడు షణ్ముక్ కొంత కాలంగా గొంతు నొప్పి, మింగలేకపోవడం, తినలేక బాధపడుతున్నాడు. చాలా ఆస్పత్రులకు వెళ్లినా ఫలితం లేక ఖమ్మం నెహ్రూనగర్‌లోని ప్రవీణ్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో డాక్టర్ ఎం.జీ.వీ.ప్రవీణ్‌ను సంప్రదించారు. బాలుడికి ఎండోస్కోపీ నిర్వహించినా ఫలితం లేక సిటీ స్కాన్ చేయగా గొంతు వెనుక భాగంలో వస్తువు కనిపించింది. అత్యంత సున్నితమైన మెదడు అడుగు భాగాన పదునైన వస్తువు ఉన్నట్లు తేలడంతో శస్త్రచికిత్స ద్వారా బయటకు తీయగా అది ప్లాస్టిక్ గన్ బుల్లెట్‌గా గుర్తించారు. దీన్ని అలానే వదిలేసి ఉంటే కపాలం నుంచి మెదడులోకి చొచ్చుకెళ్లి మెదడుకు రక్తం సరఫరా చేసే రక్తనాళాలను పాడు చేసేదని వైద్యుడు తెలిపారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

సుజాతనగర్: సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామ పరిధిలోని చెరువును అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఆక్రమించుకున్నాడంటూ ఆయకట్టు రైతులు పోలీసులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాల ప్రకారం... గ్రామ పరిధిలోని పోతులూరి కుంటపై 22 మంది రైతులు ఆధారపడి కొన్నేళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. రెండు రోజులుగా జేసీబీ సాయంతో ఏడెకరాల విస్తీర్ణంలో లెవలింగ్ పనులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జేసీబీతో చెరువులో తవ్వకాలు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా.. పనులు చేయిస్తున్న వ్యక్తులను విచారిస్తే పట్టా ఉందని చెబుతున్నారని, త్వరలో సర్వే చేయించి చెరువు హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్

మణుగూరు టౌన్: మండలంలోని సమితిసింగారం పంచాయతీ అశోక్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో రెండు చోట్ల పోలీసులు గురువారం దాడులు నిర్వహించి 30 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నారు. సీఐ నాగబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ రంజిత్, మనీషాలు అశోక్‌నగర్‌లోని బి.సత్యం నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజీవ్‌గాంధీ నగర్‌లోని కొండి వీరభద్రం నివాసంలో నిల్వ ఉంచిన పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వాగు మల్లారంలో..

మండలంలోని వాగు మల్లారంలో పోతుల వెంకట్ చౌదరి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 30 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సీజ్, కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లాయీస్ డీటీ శివకుమార్ తెలిపారు.

నాటు సారా స్వాధీనం

చర్ల: మండలంలో అక్రమంగా నాటు సారాను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 24 లీటర్ల సారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని శివారు గ్రామంలో ప్రధాన రహదారిపై తనిఖీలు చేపట్టిన క్రమంలో సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

చంద్రుగొండ : చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి గురువారం రాత్రి తెలిపారు. రావికంపాడుకు చెందిన పిన్నబోయిన వెంకటేశ్వర్లు ఇంట్లో చోరీ జరగగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఎస్ఐ పి.శివరామకృష్ణ వాహనాల తనిఖీ చేపడుతున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన పిన్నబోయిన రాము అనే వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించగా చోరీ ఉదంతం వెల్లడయింది. అతని నుండి బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ. 20 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లోనూ కంటైనర్ గృహాలు

- ఖర్చు తక్కువ.. అన్ని వసతులు
- నచ్చిన కొలతల్లో తయారీకి అవకాశం



చింతల సతీష్, ఇంటి యజమాని



కొణిజర్లలో ఏర్పాటు చేసిన క్యాబినెట్ ఇల్లు



అటాచ్డ్ బాత్‌రూమ్‌తో బెడ్ రూమ్

కొణిజర్ల: ఇప్పటి వరకు నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, చిన్నపాటి ఆఫీసులుగా చూసిన కంటైనర్ ఇళ్లు ఇప్పుడు అందరికీ చేరువవుతున్నాయి. ఇష్టం వచ్చిన రీతిలో త్వరగా సమకూర్చుకునే అవకాశం ఉన్నందున గ్రామాల్లోనూ పలువురు వీటిని ఆర్డర్‌పై తయారు చేయించుకుంటున్నారు.

దూలపల్లిలో తయారీ..

కొణిజర్ల వాసి చింతల సతీష్‌కు ఇక్కడ 300 చదరపు అడుగుల స్థలం ఉంది. ఈ స్థలంలో బేస్‌మెంట్ నిర్మించాక ప్రీ ఫ్యాబ్రికేట్ ఇళ్లు సిద్ధం చేసి ఇస్తున్నారని తెలియడంతో హైదరాబాద్ కొంపల్లి సమీపాన దూలపల్లిలోని సంస్థను సంప్రదించాడు. దీంతో కిచెన్, హాల్, సింగిల్ బెడ్ రూమ్ అటాచ్డ్ బాత్‌రూమ్‌తో కంటైనర్ రూపంలోని ఇల్లు తయారుచేసి ఇచ్చారు. ప్రత్యేక వాహనంపై తీసుకొచ్చి ముందే నిర్మించిన బేస్‌మెంట్‌పై ఫిట్ చేయించాడు. తనకు ఉన్న స్థలం కొలతల ఆధారంగా ఇంటిని సిద్ధం చేయించుకున్న సతీష్ ఇందుకోసం రూ.6 లక్షల వ్యయమైందని, జీఎస్టీ, రవాణా కలిపి మరో రూ.లక్ష వెచ్చించానని చెబుతున్నారు. ఇంటీరియర్ డిజైన్‌తో పాటు వాటర్, హీట్, ఫైర్ ప్రూఫ్‌గా ఉండి ఏడాది వారంటీతో ఇచ్చారని వెల్లడించాడు. కాగా, ఈ ఇంటిని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్‌తో పాటు నచ్చిన కొలతలతో ఇంటి నిర్మాణానికి అవకాశం ఉండడంతో పలువురు సంస్థను సంప్రదించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ ఇళ్లలో కాస్తంత ఎత్తు తక్కువగా ఉండడం కొంత లోపంగా చెబుతున్నారు. సాధారణంగా ఇళ్లు పది అడుగుల ఎత్తులో నిర్మిస్తుంటే ఈ క్యాబినెట్ ఇల్లు మాత్రం 9 అడుగుల ఎత్తులోనే ఉంది.